
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

గురువారం 4 డిసెంబరు 2025

నేడు మెదక్‌లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

మెదక్ అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెదక్ వెస్లీ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. బుధవారం పాఠశాలను సైన్స్ అధికారి రాజిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఏడు అంశాలకు సంబంధించి దాదాపు 400 వరకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉండనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా 54 ఇన్‌స్పైర్ ఎగ్జిబిట్లు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

మూడు మున్సిపాలిటీలు

ఇక నుంచి జీహెచ్ఎంసీ



అమీన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో రికార్డులను స్వాధీనం చేసుకుంటున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్

రికార్డులు స్వాధీనం చేసుకున్న గ్రేటర్ అధికారులు

అమీన్‌పూర్/రామచంద్రాపురం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలోని సంగారెడ్డి జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు అధికారికంగా నేటి నుంచి జీహెచ్ఎంసీ పాలన పరిధిలోకి వెళ్లను న్నాయి. అమీన్‌పూర్, తెల్లాపూర్ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం పరిధిలోకి, ఐడీఏ బొల్లారం కూకట్‌పల్లి జోన్ పరిధిలోకి తెస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపాలిటీలకు సంబంధించిన రికార్డులను జీహెచ్ఎంసీ అధికారులు అప్పగించే ప్రక్రియ బుధవారం రాత్రి వరకు కొనసాగింది. పటాన్‌చెరు డివిజన్ జోనల్ కమిషనర్ సురేష్ అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి నుంచి రాత్రి 9 గంటల వరకు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. పన్నుల రికార్డులు, మినిట్స్ బుక్కులు, బ్యాంకుల ఖాతాల చెక్కుబుక్కులు, రెవెన్యూ, సానిటేషన్, టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన కీలకమైన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం మున్సిపల్

మిగతా 8వ పేజీలో

విలీనం.. అధికారికం 7

నిర్మలాజగ్గారెడ్డిని, కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవో నాయకులు





సంగారెడ్డిలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవో నాయకులు, కలెక్టర్ ప్రావీణ్యకు సమస్యలు తెలుపుతున్న నిర్మలాజగ్గారెడ్డి, టీఎన్జీవో నాయకులు

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిని బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో టీఎన్జీవో జిల్లా కమిటీ సభ్యులు కలిసి వారి సమస్యలు వివరించారు. టీఎన్జీవో సంఘానికి కేటాయించిన భూమిలో కొందరు అక్రమంగా కబ్జాకు ప్రయత్నిస్తున్నారని నిర్మలా జగ్గారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సంఘానికి కేటాయించిన స్థలంలో సంఘం భవనం కట్టుకోవడానికి హెచ్ఎండీఏ ద్వారా అనుమతి కూడా ఇవ్వడం జరిగిందన్నారు. భవన నిర్మాణానికి తమకు సహకరించాలని కోరారు. అనంతరం నిర్మలాజగ్గారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు సమస్యను వివరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జావేద్, సభ్యులు శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యం చేసిన ఈ ప్రాంతంలోని గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లను త్వరలోనే పూర్తిచేస్తామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. హుస్నాబాద్‌కు మొదటిసారి వచ్చిన సీఎంకు నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అనుకున్న సమయానికి కంటే మూడు గంటలన్నర ఆలస్యంగా వచ్చినా జనం కదలకుండా ఆయన కోసం వేచి ఉన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం పట్టణంలోని స్థూపం వద్ద జరిగిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు.









సభకు హాజరైన జనం, అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని రిమోట్ బటన్‌నొక్కి ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్‌వెంకటస్వామి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు

స్వాగతం తెలుపుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గౌరవెల్లి, గండిపల్లి

పూర్తిచేస్తాం

- హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయం.. రింగు రోడ్డు నిర్మిస్తాం
- అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 3.30 గంటలు ఆలస్యంగా వచ్చినా కదలని జనం
- సభకు హాజరైన మంత్రుల బృందం
- అన్నితానై నడిపించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :గత పాలకులు సెంటిమెంట్‌కు హుస్నాబాద్‌ను ఉపయోగించుకుని గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లను అభివృద్ధి చేసుకున్నా కానీ ఈ ప్రాంతాన్ని పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల కంటే వెనుక శంకుస్థాపన చేసిన కొండపోచమ్మ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌ను పూర్తి చేసి గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్‌లను పక్కన బెట్టారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అలా కాదని హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయకుండా అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న బహుజన రాజ్యానికి పునాదులు వేసిన గడ్డ ఇది అని కొనియాడారు. రెండేళ్లక్రితం ఇదే రోజున ప్రజాపాలన ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీఎం రేవంత్‌రెడ్డి సభా ప్రాంగణంలో రూ.262.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముఖ్యంగా రూ.44.12 కోట్లతో నిర్మించే శాతవాహన యూనివర్సిటీ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల భవనాలకు, రూ. 58.91 కోట్లతో నిర్మించే హుస్నాబాద్- అక్కన్నపేట ఫోర్‌లైన్ రోడ్డు, రూ. 45 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఏటీసీ సెంటర్‌తో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

మిగతా 7వ పేజీలో

నిధులివ్వండి..



మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌కు రింగ్‌రోడ్డు, హుస్నాబాద్ పట్టణ తాగు నీటి సరఫరాకు రూ. 60కోట్లు మంజూరు చేయాలని, పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు రూ.80 కోట్లు, పాఠశాలల అభివృద్ధికి నిధులు, పాడి పశువుల అభివృద్ధికి చేయూతకు నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.



లంబాడీ నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

191 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన పలువురు ఉద్యోగులకు సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఆగ్రహానికి షోకాజ్ నోటీసులు చేశారు. మొదటి విడతకు సంబంధించిన శిక్షణ కార్యక్రమానికి హాజరు కాని 191 మంది ఉద్యోగులకు జారీ చేశారు. వీరందరూ మళ్లీ 5వ తేదీన నిర్వహించే ఆయా డివిజన్ కేంద్రాల్లో నిర్వహించే శిక్షణకు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. లేదంటే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.



ఏర్పాట్లు పూర్తి : సంగారెడ్డి కలెక్టర్

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య పాల్గొని పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

ఒకరిని అడిగితే.. ఇంకొకరిని పంపారు!

- సంగారెడ్డి జిల్లా డీసీహెచ్ఎస్ నిర్వాకంపై విమర్శలు !

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) సంగారెడ్డి జిల్లా అధికారుల నిర్వాకం పలు విమర్శలకు తావిస్తున్నది. సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని టీబీ నియంత్రణ విభాగానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుంచి 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కింద ఓ ఎక్స్‌-రే యంత్రం(పోర్టబుల్) మంజూరైంది. రోగుల చాతి ఎక్స్‌-రే నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అందుబాటులో ఉన్న

మిగతా 8వ పేజీలో

తొలి విడత.. తేలిన లెక్క

- సంగారెడ్డి జిల్లాలో సర్పంచ్ బరిలో 503 మంది
- వార్డు స్థానాలకు 2,343 మంది పోటీ
- ఇక ప్రచార పర్వంలోకి అభ్యర్థులు
- రెండో విడత పరిశీలన పూర్తి

సంగారెడ్డి టౌన్/మెదక్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ కొనసాగగా, బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య తేలింది. సంగారెడ్డి జిల్లాలో తొలివిడతలో సంగారెడ్డి డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లోని 136 గ్రామ పంచాయతీల్లో ఆరు సర్పంచ్ స్థానాలు, 1246 వార్డుల్లో 113 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైనవి తీసివేయగా 130 సర్పంచ్ స్థానాలకు, 1133 వార్డులకు డిసెంబరు 11న పోలింగ్ జరగనుంది. ఉపసంహరణ అనంతరం 130 సర్పంచ్ స్థానాలకు 503 మంది బరిలో నిలిచారు. ఇక 1,133 వార్డులకు 2,343 మంది బరిలో ఉన్నారు. అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గుర్తులను అధికారులు కేటాయించారు. మెదక్ జిల్లాలోని ఆరు మండలాల పరిధిలోని 160 గ్రామ పంచాయతీల్లో సర్పంచు స్థానాలకు 770 నామినేషన్లు రాగా, ఇక 1402 వార్డు స్థానాలకు 2,500 దాఖలయ్యాయి. ఇందులో 17 సర్పంచ్, 166 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. నేటి నుంచి అభ్యర్థులు ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇక గ్రామాల్లో ప్రచారం హోరెత్తనున్నది.

రెండో విడత నామినేషన్ల స్క్రూటీని..

రెండో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల దాఖలు మంగళవారంతో ముగియగా, పలుచోట్ల అర్ధరాత్రి వరకు కొలిక్కి రాలేదు. షెడ్యూల్ ప్రకారం బుధవారం నామినేషన్ల పరిశీలన(స్క్రూటీని) పూర్తయింది. డబుల్ నామినేషన్లు ఉన్న వాటిని ఒకటి చేసి, తప్పులు ఉన్న వాటిని తిరస్కరించారు. పరిశీలన అనంతరం సంగారెడ్డి జిల్లాలోని రెండో విడతలో పది మండలాల్లోని 243 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లకు 1,397, 2,164 వార్డులకు వచ్చిన 4,816 నామినేషన్లను ఆమోదించారు. పరిశీలన పూర్తైన అనంతరం అభ్యర్థుల జాబితాను క్లస్టర్ల వద్ద ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రదర్శించారు. నేడు నామినేషన్లపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఉపసంహరణకు డిసెంబరు 6 వరకు అవకాశం ఉంది.



శివ్వంపేట : నామినేషన్ కేంద్రంలో అభ్యర్థుల హడావిడి

సంగారెడ్డి జిల్లాలో తొలివిడత నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వివరాలు

గ్రామపంచాయతీలు 136, వార్డులు 1246 (బ.అ. : బరిలో నిలిచిన అభ్యర్థులు)

మండలం	పంచాయతీలు	ఏకగ్రీవం	బ.అ.	వార్డులు	ఏకగ్రీవం	బ.అ.
సంగారెడ్డి	11	0	46	104	14	133
కంది	22	1	56	212	18	513
కొండాపూర్	24	0	99	222	22	499
సదాశివపేట	30	1	86	272	12	629
పటాన్‌చెరు	3	0	12	36	0	108
గుమ్మడిదల	8	0	51	66	0	174
హత్నూర	38	4	153	334	47	287

అంతా అస్తవ్యస్తం..

మెదక్ జిల్లాలో గందరగోళంగా నామినేషన్ల ప్రక్రియ

మెదక్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నవంబరు 27న ప్రారంభమైన ఎన్నికల తొలివిడత ప్రక్రియ నుంచి మొదలుకుని బుధవారం నాటి మూడో విడత వరకు సమస్యలు తప్పడం లేదు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ఇలా ప్రతీ దశలోనూ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తుండడంతో గుర్తింపు పత్రాలు, ధ్రువీకరణ పరిశీలనకు తీవ్ర జాప్యం జరుగుతోంది. చాలా మంది అభ్యర్థులు మూడు నుంచి నాలుగు గంటల పాటు వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. నామినేషన్ల పరిశీలన దశలోనూ పరిస్థితి మెరుగుపడలేదు. ఫారాల పరిశీలనలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడం, సాంకేతిక సమస్యలు, డేటా వినియోగంలో జాప్యం తదితర కారణాలతో ఆలస్యం జరుగుతోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి అత్యవసర పరిష్కార చర్యలపై వివరాలు తెలియడం లేదు. తొలివిడత దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ బుధవారం జరగగా, రాత్రి 11 గంటల తర్వాతే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలు వెల్లడిస్తామని జిల్లా పంచాయతీ అధికారులు తేల్చి చెప్పారు. అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తుల వివరాలు, మూడో విడత తొలిరోజు నామినేషన్ల సంఖ్య బహిర్గతపరచడానికి విపరీతమైన ఆలస్యం నెలకొన్నది. ఈ చర్యలతో అభ్యర్థుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

మూడో విడత షురూ

నారాయణఖేడ్/మెదక్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు సంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది మండలాల్లో, మెదక్ జిల్లాలోని ఆరు మండలాల్లో కొనసాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్ డివిజన్‌లోని 8 మండలాలతో పాటు జహీరాబాద్ డివిజన్‌లోని న్యాల్‌కల్ మండలంలో బుధవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 8 మండలాల్లో 234 సర్పంచు స్థానాలకు 155 మంది, 1,960 వార్డులకు 117 మంది నామినేషన్లు వేశారు. నామినేషన్లు సాయంత్రం 5గంటలలోపు వేయాల్సి ఉన్నప్పటికి, పంచగామ, సంజీవన్‌రావుపేట, ర్యాకల్, క్లస్టర్‌లలో సమయం లోగా వచ్చిన అభ్యర్థులకు టోకెన్‌లు

మిగతా 8వ పేజీలో

ఎందుకీ.. రహస్య సమావేశం..

- గ్రామస్థులను పిలవకుండానే కొందరితో..
- అడ్డుకున్న కాలుష్య పోరాట సమితి నాయకులు
- తహసీల్దార్, కమిషనర్, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు


ఆందోళన చేస్తున్న కాలుష్య పోరాట సమితి నాయకులు

గుమ్మడిదల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని దోమడుగు గ్రామస్థులు నెల రోజులుగా ఆఊరి చెరువు కలుషితంపై, కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ఆ ఊరు చెరువు కలుషితంపై క్యాండిల్ ర్యాలీలు, కలెక్టరేట్ ముందు నిరసనలు కొనసాగాయి. అయితే, బుధవారం దోమడుగు గ్రామస్థులకు ఎలాంటి సమాచారం లేకుండానే ఆ ఊరి నుంచి కొంతమంది నాయకులను పిలిపించుకుని అధికారులు రహస్యంగా సమావేశం నిర్వహించారు. మాజీ సర్పంచ్ రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ గోవర్దన్‌గౌడ్, బీజేపీ నాయకుడు రాజిరెడ్డితో పాటు కొంతమంది గ్రామస్థులతో పరిశ్రమ ప్రతినిధులు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, స్థానిక ఎస్ఐ తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న దోమడుగు కాలుష్య వ్యతిరేక పోరాట సమితి నాయకులు, గ్రామస్థులు సమావేశాలోకి చొచ్చుకెళ్లి అధికారులను నిలదీశారు. రహస్యంగా ఎందుకు సమావేశం పెడుతున్నారని ప్రశ్నించారు. ఆగ్రహించిన పోరాట సమితి నాయకులు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అధికారులు ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా కాలుష్య పోరాట సమితి నాయకుడు స్వేచ్ఛారెడ్డి మాట్లాడుతూ కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలని, అందరం కలిసి ఒకవైపు ధర్నాలు, నిరసనలు చేస్తూ ఉంటే సహకరించాల్సింది పోయి అధికారులు పరిశ్రమ ప్రతినిధులతో కలిసి ఎందుకు రహస్య సమావేశం నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది అమ్ముడుపోయే నాయకులను వెంట బెట్టుకొని పరిశ్రమ యాజమాన్యం పోరాటాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తుందని ఆరోపించారు. పరిశ్రమలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ యాజమాన్యానికి కొమ్ముకాస్తు సమావేశమవడమేంటని ప్రశ్నించారు. ఏదైనా గ్రామంలో చాటింపు వేయించి, గ్రామస్థులకు ముందస్తు సమాచారం ఇచ్చి సమావేశం నిర్వహించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

రేపటి నుంచి మల్లికార్జున స్వామి జాతర


ముస్తాబైన బిలాల్‌పూర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయం


ఆలయంలో కొలువుదీరిన స్వామివారు

కోహీర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామంలో ఈ నెల 6 నుంచి 9 తేదీ వరకు మల్లికార్జున స్వామి (సట్టి) జాతర ఉంటుందని నిర్వాహకులు, బిలాల్‌పూర్ గ్రామస్థులు తెలిపారు. ఈ నెల6న సాయంత్రం 4 గంటలకు మైసమ్మ, ఉరడమ్మ దేవతకు బోనాల కార్యక్రమం నిర్వహించి జాతర ఉత్సవాలు ప్రారంభించనున్నారు. 7న స్వామి వారి కల్యాణం, అగ్ని గుండ ప్రవేశం, రాత్రి రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 8న స్వామివారి ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 8, 9 తేదీల్లో రాత్రి 10 గంటలకు బీరప్ప కథ అనే బయలు నాటకము హంస కళా నాట్య మండలి వారిచే ప్రదర్శించనున్నట్లు తెలిపారు. భక్తులు భారీగా తరలి వచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ జడ్పీటీసీ బాల్ యాదవ్


గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ జట్పీటీసీ బాలు యాదవ్

వర్గల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ బీఆర్ఎస్ తాజా మాజీ జట్పీటీసీ బాలు యాదవ్ బుధవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీని విడిచి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో సొంత గూటికి తాను చేరుకున్నట్లు బాలు యాదవ్ స్పష్టం చేశారు. ఆయన వెంట గజ్వేల్ నియోజకవర్గం ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, వర్గల్ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నాయకులు ప్రభుగౌడ్, ప్రవీన్ గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

రెండు పదవులకు నామినేషన్లు వేసిన అభ్యర్థి

- తిరస్కరించిన ఆర్వోలు

రాయపోల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం చిన్న మాసాన్‌పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానంతో పాటు వార్డు సభ్యుడి స్థానానికి గ్రామానికి చెందిన సొక్క స్వామి నామినేషన్ వేసి ఉపసంహరించుకోకపోవడంతో రెండు నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారు. చిన్నమాసాన్‌పల్లి సర్పంచ్ స్థానంతో పాటు గ్రామంలోని 7వ వార్డుకు స్వామి నామినేషన్ దాఖలు చేశారు. ఉపసంహరణ గడువు ముగిసినా స్వామి తన నామినేషన్‌ను ఉపసంహారించుకోకపోవడంతో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఒక వ్యక్తి ఒకే పదవికి పోటీ చేయాలన్న నిబంధన మేరకు రెండు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు

అనారోగ్యంతో ప్రియుడు మృతి


- మనస్థాపంతో ప్రియురాలు ఆత్మహత్య


శ్రావణి(ఫైల్)

కుకునూరుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రియుడు అనారోగ్యంతో చనిపోగా ప్రియా నువ్వు లేని జీవితం వద్దు అని ఓ ప్రియురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఆశని శంకర్ కుటుంబ సభ్యులు తరచూ దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లి గ్రామంలోని వెళ్తుంటారు. ఈ క్రమంలో అక్కడి మహేష్‌గౌడ్ అలియాస్ రహీం బాబాతో శంకర్ కుమార్తె శ్రావణి(18)తో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. అయితే, మహేశ్ గౌడ్ అలియాస్ రహీం బాబా గత నెల 30న పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతూ చనిపోయాడు. ఆ రోజు నుండి శ్రావణి దిగాలుగా ఉంటూ తీవ్ర మనోవేదనకు గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

క్రైం కార్నర్

బైక్ పైనుంచి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


అంజన్‌రెడ్డి(ఫైల్)

చేగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బైకుపై నుంచి అదుపుతప్పి కిందపడి తలకు తీవ్ర గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నార్సింగ్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నార్సింగ్ ఎస్సై సృజన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బక్కన్న గారి అంజన్‌రెడ్డి (50) ఈ నెల 1న చేగుంటకు పని నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా నార్సింగ్ శివారులో బైకు అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నార్సింగ్‌లోని ఒక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి అంజన్ రెడ్డి మృతి చెందాడు. మృతునికి భార్య సౌమ్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. చిన్న కూతురు తేజ తండ్రికి తలకొరివి పెట్టింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రికి తరలించారు. భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు నార్సింగ్ ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్ట్ మేనేజర్ వేధింపులతో పురుగులమందు తాగిన ఉద్యోగి

- చికిత్స పొందుతూ మృతి

మెదక్ అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓ మార్ట్ మేనేజర్ వేధింపులు తాళలేక ఓ ఉద్యోగి పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబీకుల కథనం ప్రకారం.. స్థానిక నవాబుపేట వీధికి చెందిన దుర్గాప్రసాద్ (21) పట్టణంలోని విశాల్ మార్ట్‌లో కొంత కాలంగా పని చేస్తున్నాడు. అదే మార్ట్‌లో మేనేజర్‌గా పని చేస్తున్న కిరణ్ దుర్గాప్రసాద్‌పై పని ఒత్తిడి పెంచి వేధించేవాడు. ఈ వేధింపుల నుంచి తప్పించుకోవడానికి దుర్గాప్రసాద్ కొత్తగా ప్రారంభించిన ఒక షోరూం నిర్వహించిన ఉద్యోగ ఇంటర్వ్యూలకు వెళ్లాడు. విషయం తెలుసుకున్న మేనేజర్, తమ మార్ట్‌లో పని చేస్తున్న వారిని ఎవరినీ తీసుకోవద్దని సదరు షోరూం నిర్వాహకులకు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో దుర్గాప్రసాద్ 'సార్! ఇలా చేస్తే నేను చస్తాను' అంటూ మేనేజర్‌కు మెసేజ్ చేశాడు. ఇందుకు స్పందించిన మేనేజర్ 'ఐ డోంట్ కేర్' అంటూ రిప్లై ఇచ్చాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన దుర్గాప్రసాద్ మంగళవారం పురుగుల మందు తాగాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా... పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు గాంధీ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేనేజర్ కిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తండ్రి మందలించాడని..


వినయ్ కుమార్(ఫైల్)

గజ్వేల్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన కొడుకును తాగొద్దని తండ్రి మందలించడంతో యువకుడు క్రిమిసంహారక మందు సేవించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన గజ్వేల్ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రిమ్మనగూడ గ్రామానికి చెందిన వట్టు వినయ్‌కుమార్(21) గ్రామంలోని రెస్టారెంట్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. నవంబరు 27వ తేదీన మద్యం తాగొద్దని తండ్రి మందలించడంతో అదే రాత్రి గుర్తు తెలియని క్రిమిసంహారక మందు సేవించి తల్లిదండ్రులకు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ములుగు మండలంలోని లక్ష్మక్కపల్లి ఓ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


నరేష్ మృతదేహం

మనోహరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నల్గొండకు చెందిన నరేష్ మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలోని ఒక కంపెనీలో పని చేస్తూ అక్కడే అద్దెకు ఉంటున్నాడు. భార్య పిల్లలు వారి స్వగ్రామంలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామంలో రోడ్డు పక్కన అనుమానాస్పద స్థితిలో అతడు మృతి చెంది కనిపించాడు. రెండు రోజులుగా నరేష్ గ్రామంలో మద్యం సేవిస్తున్నారని కొందరు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వ్యక్తి బావిలో శవమై


దత్తు పాటిల్ (ఫైల్)

కల్హేర్/సిర్గాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి బావిలో శవమై తేలాడు. సిర్గాపూర్ ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్ గ్రామానికి చెందిన దత్తుపాటిల్(35) ఇటీవల ఇంటి నుంచి బయటికెళ్లి తిరిగిరాలేదు. దీంతో గత నెల 26న సిర్గాపూర్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ క్రమంలో వాసర్, పొట్‌పల్లి గ్రామాల మధ్యనున్న రహదారి పక్కన ఉన్న పాడుబడిన బావిలో అతడి మృతదేహం లభ్యమైంది. దత్తతపాటిల్ మృతికి కారణాలు తెలియరాలేదని, కేసు దర్యాప్తు చేసిన అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్ఐ మహేష్ తెలిపారు. ఇదిలా ఉండగా, పెళ్లి కాని దత్తుపాటిల్ మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్థులు భావిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణా.. ట్రాక్టర్ సీజ్

పుల్‌కల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామ శివారులోని మంజీర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి నది సమీపంలో ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పుల్కల్ ఎస్ఐ ఎన.విశ్వజన్ తెలిపారు. మంజీర నది గర్భం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఒక ట్రిప్పునకు రూ.5వేల నుంచి 10 వేలు

సరాఫ్‌పల్లికి చెందిన కొందరు ట్రాక్టర్ యజమానులు రాత్రి వేళల్లో మంజీర నది నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో నది గర్భంలో పెద్ద ఎత్తున ఇసుక మేటలు ఏర్పడ్డాయి. అక్రమార్కులు కూలీల సహాయంతో ఇసుకను ట్రాక్టర్లలో నింపి, పూర్తిగా లోడు ఎక్కకపోవడంతో సగం మేరకు లోడు చేసి నది ఒడ్డుకు చేర్చి నిల్వ చేస్తున్నారు. ఇలా నిల్వ చేసిన ఒక్కో ట్రాక్టర్ లోడు ఇసుకను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

శ్వాస తీసుకోలేడు.. అన్నం తినలేడు

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా.. నిర్మాతలకు కాసుల పంట పండించి ఉండొచ్చు. అల్లు అర్జున్‌ను పాన్ ఇండియా స్టార్‌గా మరో మెట్టు ఎక్కించి ఉండొచ్చు. కానీ, ఒక కుటుంబానికి మాత్రం జీవిత కాలపు పీడకలను మిగిల్చింది. రెండు తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా కలవర పెట్టిన ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ దుర్ఘటన జరిగి బుధవారంతో ఏడాది అవుతోంది. అమ్మ, నాన్న, చెల్లితో కలిసి తన అభిమాన నటుడి సినిమా చూడడానికి వెళ్లిన పదేళ్ల శ్రీతేజ్... తొక్కిసలాటలో తల్లిని కోల్పోయాడు. అదే ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్.. తన తల్లి ఇక లేదన్న సంగతి కూడా గుర్తించలేని స్థితిలో మంచంమీద నిశ్చేష్టంగా పడి ఉంటున్నాడు. ప్రమాదం జరిగి ఏడాది అవుతున్నా.. ఇంకా ఆ కుటుంబం కోలుకోకపోగా మరింత దుఃఖంలో కూరుకుపోయింది. ఆస్పత్రి నుంచి శ్రీతేజ్ ఆరు నెలల కిందట డిశ్చార్జి అయ్యాడు కానీ, అతని ఇల్లే ఇప్పుడు దవాఖానాగా, మారింది. తండ్రే నర్సు అయి నిరంతరం సపర్యలు చేస్తున్నారు. శ్రీతేజ్ తనంతట తానుగా అన్నం తినలేడు. అందుకే కడుపులోకి నేరుగా ద్రవాహారాన్ని పంపించేందుకు గ్యాస్ట్రోస్టోమీ పైపు అమర్చారు. శ్వాసకూడా తీసుకోలేడు. దాంతో గాలి నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడానికి మెడ ముందు భాగంలో రంధ్రం చేసి ట్రాకియోస్టోమీ ట్యూబ్ పెట్టారు. దీంతో శ్రీతేజ్ ఒంటినిండా ట్యూబులతో పొత్తిళ్లలో పసిబిడ్డలా ఉలుకూ పలుకూ లేకుండా పడి ఉంటున్నాడు.



ప్రతిరోజూ థెరపీలు..

శ్రీతేజ్ ఆకలి అని సైగ కూడా చేయలేడు. తొక్కిసలాటలో చిన్నారి మెదడు కణాలు 70 శాతం దెబ్బతినడమే ఇందుకు కారణం. తన చిటికెన వేలు పట్టుకొని నడవాల్సిన బాబును చేతుల్లోకి ఎత్తుకొని మోయాల్సి వస్తోందంటూ శ్రీతేజ్ తండ్రి కన్నీటి పర్యంతమయ్యారు. "రోజూ సికింద్రాబాద్‌లోని ఆసియా ట్రాన్స్‌కేర్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో కొన్ని నెలలుగా బాబుకు స్వాలో(మింగడం), స్పీచ్(మాట్లాడటం) థెరపీ ఇప్పిస్తున్నాం. అక్కడే అడ్మిట్ చేస్తే నెలకు రూ.90 వేలకు పైగా ఫీజు చెల్లించాలి. బాబును చూసుకోడానికి ఒక మనిషి అక్కడే ఉండాలి. ఇంట్లో 6ఏళ్ల నా కూతురు, 75 ఏళ్ల మా అమ్మ బాగోగులు కూడా నేనే చూసుకోవాలి. ఇంటి పనులు చక్కబెట్టుకొని.. పాపను స్కూలుకు పంపించిన తర్వాత దిల్‌సుఖ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు రోజూ క్యాబ్‌లో బాబును తీసుకొచ్చి థెరపీలు ఇప్పిస్తున్నాను. రోజుకు రూ.2 వేల చొప్పున థెరపీలకే రూ.60 వేలకుపైన కడుతున్నాను. ఇక ఇంటి దగ్గర కూడా కాళ్లు, చేతుల కదలికలకు ఫిజియోథెరపీ చేయిస్తున్నాం. అదీ రూ.30 వేలవరకు అవుతుంది. ప్రతి నెలా కేవలం థెరపీలకే తక్కువలో తక్కువ రూ.90 వేలు కడుతున్నాను. కనీసంగా 2 నుంచి 3 ఏళ్లు నిరంతరం థెరపీలు ఇప్పిస్తే బాబు కోలుకోవచ్చని డాక్టర్లు చెప్పారు" అని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ వివరించారు.

కొడుకు కోసం ఉద్యోగం వదిలేసి...

శ్రీతేజ్‌కు ప్రతి మూడు గంటలకు ఒకసారి గ్యాస్ట్రోస్టోమీ ట్యూబ్ ద్వారా ద్రవాహారం అందిస్తుండాలి. ప్రతి రెండు గంటలకు ఒకసారి మెడ దగ్గర అమర్చిన ట్రాకియోస్టోమీ పైపులోని తెమడ వంటి ద్రవాన్ని శుభ్రం చేయాలి. నిరంతరం డైపర్లు మారుస్తుండాలి. నిత్యం వేడి నీళ్లతో ఒళ్లు తుడిచి దుస్తులు వేయాలి. ఇవన్నీ చేయాలంటే ఇద్దరు మనుషుల పర్యవేక్షణ అవసరం. ఇదంతా చేయడానికి ఇంటిపట్టున ఉండే శ్రీతేజ్ నాయనమ్మకు అసాధ్యం. "ఇదివరకు బంగారం దుకాణంలో పనిచేసేవాడిని. అదే నా కుటుంబానికి ఆదరువు. ప్రమాదం తర్వాత మా జీవితం తలకిందులయింది. బాబును చూసుకోడానికి ఇంటిపట్టునే ఉంటున్నాను. మరోపక్క మా అమ్మాయిని కూడా సముదాయించాలి. ఇప్పటికి ఒక్కోరోజు అర్ధరాత్రి నిద్రలేచి అమ్మా అని పాప ఏడుస్తుంటుంది" అని చెబుతూ భాస్కర్ కన్నీటిపర్యంతమయ్యారు. ఏప్రిల్‌లో శ్రీతేజ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయినప్పటి నుంచి క్రమం తప్పకుండా థెరపీలు ఇప్పించడం వల్ల కొంచెం మార్పు కనిపిస్తోందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రమాదం అనంతరం శ్రీతేజ్ కాళ్లు పూర్తిగా ముడుచుకుపోవడంతో జూన్‌లో మరొక ప్రైవేటు ఆస్పత్రిలో కాళ్లకు శస్త్రచికిత్స చేయించారు. "కాళ్లకు ఆపరేషన్‌తో పాటు ఇప్పటివరకు థెరపీలకు రూ.20లక్షలు చెల్లించాం. శ్రీతేజ్‌కు థెరపీలు, ఇతర మందులు, డైపర్లు, ప్రత్యేకమైన ఆహారం వంటివన్నీ కలిపి నెలకు రూ.1.25 లక్షలు పైన ఖర్చు అవుతుంది. ఇక ఇంటి అద్దెతోపాటు పాప చదువుకు, అమ్మ మందులకు అయ్యేదంతా అదనం" అని శ్రీతేజ్ బాబాయి మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేశారు.

తమదే బాధ్యత అని చెప్పారు కానీ..

తొక్కిసలాటలో తన భార్య చనిపోవడంతో.. జరగరాని నష్టం జరిగిందంటూ అల్లు అర్జున్ కుటుంబం తన పిల్లల పేరుమీద రూ.2 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ చెప్పారు. ఆ మొత్తానికి నెల నెలా బ్యాంకు వడ్డీ తీసుకునే అవకాశం కల్పించారని, కానీ.. ఆ వడ్డీ డబ్బులు.. బాబు వైద్య చికిత్స ఖర్చులకు ఏమాత్రం సరిపోవడంలేదని అన్నారు. నెలకు రూ.2 లక్షల ఖర్చుకు తోడు జూన్‌లో బాబు కాళ్లకు ఆపరేషన్ చేయించినప్పుడు అదనంగా రూ.3 లక్షలు ఖర్చయ్యాయని తెలిపారు. బాబుకు సపర్యలు చేసేందుకు, చికిత్స చేయించేందుకు ఉద్యోగం కూడా మానేయడంతో ఎటువంటి ఆదాయం లేదని పేర్కొన్నారు. శ్రీతేజ్ ఆస్పత్రిలో ఉన్న సమయంలో.. అతడు పూర్తిగా కోలుకునే దాకా తమదే బాధ్యత అని, వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులన్నీ భరిస్తామని అల్లు అర్జున్ కుటుంబం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇదే విషయమై అల్లు అర్జున్‌కు గుర్తు చేసేందుకు ఆయన మేనేజర్ కాంతారావును సంప్రదించగా.. సానుకూల స్పందన రాలేదని తెలిపారు. కనీసం బాబు థెరపీల ఖర్చు వరకైనా సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏడాది గడిచినా దయనీయ స్థితిలోనే శ్రీతేజ్
ఒంటినిండా ట్యూబులతో మంచంపై నిశ్చేష్టంగా
పైపుతో ద్రవాహారం.. ప్రతి రోజూ థెరపీలు
సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు ఏడాది
కొడుకు కోసం ఉద్యోగం మానేసి తండ్రి సపర్యలు
నెలకు రూ.1.50 లక్షల దాకా అవుతున్న ఖర్చు
రూ.2 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన అల్లు అర్జున్
చికిత్స ఖర్చులకు ఏమాత్రం సరిపోని వడ్డీ డబ్బులు
శ్రీతేజ్ కోలుకునే దాకా అండగా ఉంటామన్న..
అల్లు కుటుంబం హామీని గుర్తు చేస్తున్న తండ్రి

గౌరవెల్లి, గండిపల్లి పూర్తిచేస్తాం

(5వ పేజీ తరువాయి)

హుస్నాబాద్- హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను, ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ వాహనాన్ని ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ ఇంజనీరింగ్ విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

పోటెత్తిన జనం

ఈ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున మహిళలు, యువకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. సభకు మంత్రులు, తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, వడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు విజయ రమణా రావు, డాక్టర్ సంజయ్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, నాగరాజు, రాజ్ ఠాకూర్, సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎంపీ హనుమంతరావు హాజరయ్యారు. రెండేళ్ల ప్రజాపాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని వారు కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నీ తానై సభను నడిపించారు. ఈ సభ కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపింది.

సభ సక్సెస్

సభ మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సి ఉండగా సీఎం డిల్లీ పర్యటనతో ఆలస్యంగా మొదలైంది. సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 5.28కి హెలికాప్టర్ ద్వారా హుస్నాబాద్‌కు చేరుకున్నారు. ఈ సభకు బతుకమ్మలతో, డప్పుచప్పుళ్ల నృత్యాలు చేస్తూ మహిళలు పెద్ద ఎత్తున వచ్చారు. కళాబృందాలు తమ ఆట పాటలతో ఆకట్టుకున్నారు. నియోజకవర్గం నుంచే కాకుండా ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రావడం సభా ప్రాంగణం పార్టీ జెండాలతో రెపరెపలాడింది. సీఎం పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం విధ్వంసం

● హుస్నాబాద్‌లో మంత్రులు

హుస్నాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పానలో రాష్ట్రం తీవ్ర విధ్వంసానికి గురైందని పలువురు మంత్రులు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బుధవారం జరిగిన ప్రజా పాలన విజయోత్సవ సభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రులు ప్రసగించారు.

పదేళ్లలో బీఆర్ఎస్‌ది విధ్వంస పాలన : మంత్రి తుమ్మల

పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. త్వరలోనే సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో సీఎం రేవంత్‌రెడ్డితో ఆయిల్ పాం ఫ్యాక్టరీని త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం చేపట్టబోయే గ్లోబల్ సమ్మిట్ దేశానికి కాదు, ప్రపంచ దేశాలకే వన్నె తెస్తుందన్నారు. ఇప్పటికే వ్యవసాయానికి లక్ష కోట్లు ఖర్చు చేశామన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి : మంత్రి పొన్నం ప్రభాకర్

నన్ను గెలిపించిన హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్ననని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తికి నిధులు మంజూరు చేస్తున్నారని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి పల్లెకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని, వచ్చే సీజన్‌లో దీని ద్వారా నీరు అందుతుందన్నారు. సభను విజయవంతం చేసి నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డి జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు, చిత్రంలో మంత్రులు

హామీలను అమలు చేస్తున్నం : మంత్రి వివేక్ వెంకటస్వామి

గత పాలకులు చేసిన రూ. 8లక్షల కోట్ల అప్పులకు మిత్తి రూ.5 వేల కోట్ల మిత్తి చెల్లిస్తున్నామని, అయినా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్రంలో 3 బిలియన్ డాలర్ల ఎకానమీ చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథలో కోట్ల రూపాయల కుంభ కోణం జరిగిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం అవుతుందన్నారు. రాష్ట్రంలో 115 ఏటీసీలు స్థాపించి సంవత్సరానికి రెండు లక్షల మంది శిక్షణ తీసుకునేలా కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించండి : మంత్రి శ్రీధర్‌బాబు

రెండేళ్ల ప్రజాపాలనలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదరించాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఏం చేస్తున్నారని అడిగే బీఆర్ఎస్, బీజేపీలకు మే చేసే అభివృద్ధి, సంక్షేమ పనులే సమాదానాలని తెలిపారు. ఈ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

మాజీ ఎంపీ హనుమంతరావు మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల అనంతరం మహిళలకు రూ. 2500 ఇచ్చే పథకం ప్రారంభిస్తామన్నారు. ఈ సభలో మంత్రి లక్ష్మన్‌కుమార్ మాట్లాడారు. ఇందులో డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి, హుజురాబాద్ ఇన్‌చార్జి ప్రణవ్, మాజీ హౌజ్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కర్ణకంటి మంజుల రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు తిరుపతిరెడ్డి, నిర్మల కొలుకూరి సంపత్ తదితరులున్నారు.

సర్పంచ్‌కు గులాబీ వార్డు సభ్యులకు తెలుపు బ్యాలెట్

నారాయణఖేడ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులకు గులాబి రంగు బ్యాలెట్ పేపర్, వార్డు సభ్యుల కోసం తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లను ఇవ్వనున్నారు. మూడో విడత ఎన్నికలకు సంబంధించి ఈ నెల 5 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. 6న పరిశీలన, 9న మధ్యాహ్నం 3 గంటల లోపు ఉపసంహరణకు గడువు ఉంటుంది. అనంతరం పోటీలో ఉన్నవారికి గుర్తులు కేటాయిస్తారు. బరిలో ఉన్న అభ్యర్థులకు తెలుగు అక్షర క్రమంలో గుర్తుల కేటాయింపు ఉంటుందని, నామినేషన్ పత్రాలలో పేర్లు ఏ విధంగా రాస్తారో ఆ విధానాన్ని బట్టి గుర్తులు కేటాయిస్తారని అధికారులు తెలిపారు.

ఈసారి బ్యాలెట్ పేపర్‌లో నోటా

ఈసారి బ్యాలెట్ పేపర్‌లో నోటా గుర్తు కూడా ఉంటుంది. సర్పంచ్ అభ్యర్థులకు సంబంధించి 30 గుర్తులను కేటాయించారు. కొత్తగా నోటాను కూడా అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు అధికంగా ఉంటే ప్రత్యేకంగా బ్యాలెట్ పేపర్లను ముద్రిస్తారు. సర్పంచ్ అభ్యర్థుల కోసం ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీ పర్స్, టీవీ రిమోట్, చెత్తడబ్బా, వజ్రం లాంటి గుర్తులను కేటాయించారు. వార్డు సభ్యులకు సంబంధించి 20 గుర్తులు అలాగే నోటా కూడా ఉంటుంది. ఇందులో గౌను, గ్యాస్‌పొయ్యి, స్టూలు, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్, కుండ, డిష్ యాంటెన్నా, గరిటె, కడాయి, ఐస్‌క్రీమ్, గాజు గ్లాస్, పోస్టు డబ్బా, ఎన్వలప్, హాకీ కర్ర, బాల్, టై, కటింగ్ ప్లేయర్, ట్రంకు పెట్టె, విద్యుత్ స్తంభం, కెటిల్ గుర్తులు ఉన్నాయి.

ఓటరు లిస్టులో పేరు లేకపోయినా.. ఎన్నికల బరిలో మహిళ

చేగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామం ఈసారి కొత్త పంచాయతీగా ఏర్పడింది. మొదట్లో బీసీ జనరల్ కేటగిరీ కాగా... తిరిగి ప్రకటించిన నేపథ్యంలో చేగుంట మండలం కిష్టాపూర్ స్థానం బీసీ మహిళకు రిజర్వుడు అయింది. దీంతో మొదట్లో పోటీ చేద్దామనుకున్న వ్యక్తి తన భార్యను బరిలో దింపేందుకు సిద్ధమయ్యాడు. తీరా ఆమె పేరు ఓటరు లిస్టులో లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ అనంతరం భర్త అదే గ్రామ వాసి కావడంతో భార్యకు అవకాశం కల్పించాలని హైకోర్టు ఎన్నికల అధికారికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో చివరి నిమిషంలో మంగళవారం ఎట్టకేలకు భార్య నాయిని అన్నపూర్ణ నామినేషన్ దాఖలు చేయగలిగారు. దీంతో ఆ దంపతులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల బరిలో దిగేందుకు పరిస్థితులు సుగమమయ్యాయి.



సర్పంచి అభ్యర్థికి నామినేషన్ వేసిన నాయిని అన్నపూర్ణ

సర్పంచ్ పదవి వేలంపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్హేర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఖానాపూర్(కె) గ్రామ పంచాయతీకి సంబంధించిన సర్పంచ్ పదవి కోసం నిర్వహించిన వేలం పాటపై కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్, ఎస్సై రవిగౌడ్ బుధవారం విచారణ జరిపారు. 'రూ.25 లక్షల వరకు వేలం, ఖానాపూర్(కె)లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాయిదా' అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన వార్తకు సంగారెడ్డి జిల్లా ఎన్నికల మానిటరింగ్ కమిటీ నోడల్ అధికారి స్పందించారు. ఈ మేరకు తహసీల్దార్ శివ శ్రీనివాస్‌కు ఈ విషయంపై విచారణ జరపాల్సిందిగా సర్క్యులర్ జారీ చేశారు. దీంతో అధికారులు వేలం పాటపై ఖానాపూర్(కె) గ్రామంతో పాటు పంచాయతీ పరిధిలోని గిరిజన తండాలో విచారణ జరిపారు. ఈ విచారణలో డిప్యూటీ తహసీల్దార్ పవన్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ గ్రామ పంచాయతీ నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యేలు విజయపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డిల సొంత జీపీ కావడంతో వేలం పాట విషయం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఏకగ్రీవాల హవా

● తొలివిడతలో పలు గ్రామ పంచాయతీలు, వార్డులు ఏకగ్రీవం
● రెండో విడతలోనూ కొన్ని చోట్ల ఒక్కో నామినేషన్ దాఖలు



పాపన్నపేట, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి) : కొంత మంది సర్పంచ్ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపకరించుకోవడంతో పాపన్నపేట మండలంలో ఆరు గ్రామపంచాయతీలల్లో సర్పంచు అభ్యర్థులతో పాటు 50 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాపన్నపేట మండలంలో మొత్తం 40 గ్రామపంచాయతీల గాను 346 వార్డుల ఎన్నికలకు నామినేషన్ల పర్వం కొనసాగింది. యూసుఫ్ పేట గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఏ అనిత నరేందర్‌రెడ్డి, మల్లంపేట సర్పంచ్‌గా పుట్టి పద్మరమేష్, కందిపల్లి సర్పంచ్‌గా పుట్టి భాగ్య ఎల్లయ్య, అమిరియా తండా సర్పంచ్‌గా లూనావత్ కిషన్, లక్ష్మీనగర్ సర్పంచ్‌గా కన్నెగంటి విజయ దుర్గ నాని, నామాపూర్ సర్పంచ్‌గా ఘనాజిగారి భ్యాతమ్మ దశరథ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 34 పంచాయతీలకు వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి

● సదాశివపేట : మండలంలో 30 గ్రామ పంచాయతీలుండగా, మెలిగిరిపేట గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ మద్దతుదారుడు షాబుద్ధీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 29 జీపీల్లో మొత్తం 86 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. 272 వార్డులకుగాను 12 వార్డు ఏకగ్రీవమయ్యాయి.

● రేగోడు : మండలంలో 18 గ్రామపంచాయతీలకు 46 మంది, 152వార్డులకు 313 మంది బరిలో ఉన్నారు. మండలంలోని జగిర్యాల ఒకటి, పోచారంఒకటి, వెంకటాపురం, తిమ్మపురం రెండు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. సాయంత్రం 5 గంటల వరకు గుర్తుల కేటాయించకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

● చిన్నశంకరంపేట : మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు 185 సర్పంచ్, 682 వార్డులు నామినేషన్‌లు ధాఖలు చేశారు. టీమాందాపూర్ తాండ, గవ్వలపల్లి తండాలో సర్పంచ్, వార్డులకు ఒక్కరే నామినేషన్ ధాఖలు చేయడంతో ఏకగ్రీవమయ్యాయి.

● నిజాంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిజాంపేట మండల పరిధిలో 16 పంచాయతీలకు గాను మూడు గ్రామాల సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. ఇక్కడ ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి. దీంతో ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యాక అధికారికంగా ప్రకటించనున్నారు. మండలంలోని నందగోకుల్, పాతూరి భాను ప్రకాష్ రెడ్డి, నగరంలో అంతంపల్లి సుశీల, చౌకత్ పల్లిలో మడావత్ సునీత సర్పంచ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.

● తూప్రాన్ : మండలంలో సర్పంచు, వార్డు సభ్యుల పదవులకు ధాఖలు చేసిన నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎంపీడీఓ శాలికా తేలు తెలిపారు. మండలంలో కోనాయపల్లి (పీబీ) గ్రామ పంచాయతీలో మూడో వార్డుకు పంది మల్లయ్య, ఐదో వార్డుకు జంగం వెంకటేశ్, ఇమాంపూర్ గ్రామ పంచాయతీలో ఐదో వార్డుకు మన్నె అరణ ఒక్కటే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

● నారాయణఖేడ్ : మండలంలోని అల్లాపూర్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను గ్రామస్తులంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి తీర్మానం చేశారు. సర్పంచ్‌గా కమలానాయక్, ఉప సర్పంచ్‌గా రాంశెట్టి, వార్డు సభ్యులుగా రాజు, రుక్మిణి, మంగలి బాయి, బలరాం, జి.రాజు, ఎం.రాజు, లక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి తీర్మానించారు.



నారాయణఖేడ్ మండలం అల్లాపూర్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులు

● హత్నూర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో 38 గ్రామ పంచాయతీలకు గాను నాలుగు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. తెల్లరాల్లతండా, దేవునిగుట్టతండా, లింగాపూర్, పన్యాల గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావడంతో పాటు 47 వార్డులు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. తెల్లరాళ్ల తండా సర్పంచ్‌గా నినావత్ సుశీల మల్లేశం, దేవునిగుట్టతండా సర్పంచ్‌గా ధరావత్ మధు, లింగాపూర్ సర్పంచ్‌గా చార్ల మణిదీప్, పన్యాల సర్పంచ్‌గా జిన్నారం వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● టేక్మాల్ : మండలంలోని ముదు గ్రామ పంచాయతీలకు ఒక్కో నామినేషన్ రావడంతో ఏకగ్రీవమయ్యాయి. అలాగే సగ్రాతండాకు చెందిన కేతవత్ లత, కేతవత్ నరేష్ కేతవత్ సక్రు సర్పంచ్‌కు నామినేషన్ దాఖలు చేయగా, పెద్దల సమక్షంలో మాట్లాడి కేతవత్ సక్రును ఏక గ్రీవం ఏన్నుకున్నారు. మిగత ఇద్దరితో నామినేషన్ పత్రాలను ఉపసంహరింపజేశారు.

● హవేళీఘణపూర్ : మండలంలోని గాజిరెడ్డిపల్లి సర్పంచ్‌గా రమావత్ సురేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల ఎన్నికల అధికారి తెలిపారు.

● ములుగు : ఎమండలం జప్తిసింగాయపల్లి సర్పంచ్‌గా బొమ్మగల లక్ష్మి ఒక్కరే నామినేషన్ వేశారు. మూడు, ఐదో వార్డులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● రామాయంపేట : రాయిలాపూర్‌లో మెజారిటీ వార్డుల్లో ఒక్క నామినేషనే దాఖలు కావడంతో ఏకగ్రీవమయ్యాయి.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

చేగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు వేసిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సాధారణ ఎన్నికల పరిశీలకురాలు భారతి లక్పతి నాయక్ అధికారులకు సూచించారు. బుధవారం నార్సింగ్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ కౌంటర్లను ఆమె సందర్శించారు. ప్రతి నామినేషన్‌ను జాగ్రత్తగా పరిశీలించి ఆ తర్వాతే తిరస్కరణ చేయాలన్నారు. ఆమె వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి, నార్సింగ్ ఎంపీడీవో వంగ ప్రీతి రెడ్డి, తహసీల్దార్ గ్రేసీబాయి, ఎస్సై సృజన, ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

ఏకగ్రీవం పేరుతో బెదిరిస్తే క్రిమినల్ కేసులు : డీఎల్పీవో

జగదేవ్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏకగ్రీవం పేరుతో బెదిరింపులకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవని డీఎల్పీవో లత హెచ్చరించారు. జగదేవ్‌పూర్ మండలం మాదాపూర్ గ్రామంలో ఏర్పడిన ఏకగ్రీవ వివాదంపై గ్రామస్థురాలు నర్రా లక్ష్మి కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె బుధవారం విచారణ జరిపారు. డీఎల్పీవో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని, 21 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి అభ్యర్థిగా నిలిచే అర్హత ఉన్నదని గుర్తుచేశారు. గ్రామంలో ఏకగ్రీవ ఒత్తిడుల గురించి పలువురు వ్యక్తులు మౌఖిక విచారణ వాగ్మూలాలను సేకరించినట్లు తెలిపారు. వ్యక్తుల స్వేచ్ఛను హరిస్తే వారిపై చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదవుతాయని హెచ్చరించారు.

విలీనం అధికారికం..

● జీహెచ్‌ఎంసీలోకి మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు
● పురపాలక శాఖ ఉత్తర్వులు.. రంగంలోకి బల్దియా

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో శివార్లలోని 20 మునిసిపాల్టీలు, ఏడు కార్పొరేషన్ల విలీనం అధికారికంగా పూర్తయ్యింది. ఈ మేరకు పురపాలక శాఖ బుధవారం ఉత్తర్వులు (జీఓ-264) జారీ చేసింది. పట్టణ స్థానిక సంస్థల కౌన్సిల్ తీర్మానాలు, మినిట్స్ బుక్ సీజ్, బ్యాంకు ఖాతాల స్తంభింపచేసి అందులోని డబ్బులను జీహెచ్‌ఎంసీ ఖాతాలోకి బదిలీ, కార్యాలయాలకు జీహెచ్‌ఎంసీ పేరిట బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొంటూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. 30 మంది డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ల (డీఎంసీ)లకు బాధ్యతలు అప్పగిస్తూ సాయంత్రం 6 గంటల సమయంలో ప్రొసీడింగ్స్ రాగా.. రాత్రే డీఎంసీలు రంగంలోకి దిగారు. ఆయా సంస్థల కార్యాలయాలకు వెళ్లి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాల ఫ్రీజ్‌కు లేఖలు సిద్ధం చేశారు.

రికార్డుల స్వాధీనం

నిర్మాణ అనుమతులు జారీ చేయకుండా, బిల్లులు చెల్లించకుండా పాలనా వ్యవహారాలను స్తంభింపచేశారు. మునిసిపాలిటీ స్వరూపం, ఉద్యోగులు, సిబ్బంది వివరాలు, స్థిర, చరాస్తులు, డిపాజిట్లు, పెట్టుబడులు, పన్నులు, పన్నేతర ఆదాయం, ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలు, చేపట్టిన పనులు, చెల్లించాల్సిన బిల్లులు, మూడేళ్లలో జారీ చేసిన భవన నిర్మాణ/లేఅవుట్ అనుమతుల జారీ వివరాలు సేకరించాలని ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్నారు. రికార్డులు స్వాధీన ప్రక్రియను పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్లకు సూచించారు. మునిసిపాల్టీలు, కార్పొరేషన్ల రికార్డుల స్వాధీనం, డేటా బదిలీకి సహకరించాలని మంగళవారమే కర్ణన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు లేఖ రాశారు. వివరాల సేకరణ, రికార్డుల స్వాధీనానికి సంబంధించి ప్రొఫార్మను ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. విలీన మునిసిపాల్టీలకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించనున్నారు. మునిసిపాలిటీ ఏర్పాటు? విస్తీర్ణం, గ్రేడ్, 2001, 2011 లెక్కల ప్రకారం జనాభా, ప్రస్తుతం ఉన్న కుటుంబాలు, వార్డులు, మురికివాడలు, ఉద్యోగులు, మూడేళ్లుగా ఆదాయ, వ్యయాలు, మార్కెట్లు, తదితర వివరాలన్నీ ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్న ఫార్మాట్‌లో సేకరించాలని సూచించారు. పూర్తి వివరాల సేకరణ నేడు లేదా రేపు పూర్తవుతుందని ఓ అధికారి తెలిపారు.

జీహెచ్‌ఎంసీ 5 జోన్లలో కలిసిన 20 మున్సిపాల్టీలు.. 7 కార్పొరేషన్లు..

ఎల్బీనగర్ జోన్	సికింద్రాబాద్ జోన్	కూకట్‌పల్లిజోన్	చార్మినార్ జోన్	శేరిలింగంపల్లి జోన్
మీర్‌పేట్	బోడుప్పల్	దుండిగల్	ఆదిబట్ల	బండ్లగూడ జాగీర్
పెద్దఅంబర్ పేట	జవహర్‌నగర్	గుండ్లపోచంపల్లి	బడంగ్ పేట్	మణికొండ
తుక్కుగూడ	నాగారం	కొంపల్లి	జల్‌పల్లి	నార్సింగి
దమ్మాయిగూడ	తూంకుంట	మేడ్చల్	శంషాబాద్	అమీన్‌పూర్
ఘట్ కేసర్	-	నిజాంపేట్	తుర్కయాంజాల్	తెల్లాపూర్
పీర్జాదిగూడ	-	బొల్లారం	-	-
పోచారం	-	-	-	-

ఫటాఫట్

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

- నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి



నారాయణఖేడ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, పోస్టులు ఎవరు పెట్టినా ఉపేక్షించబోమని పేర్కొన్నారు.

ప్రశ్న: శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

డీఎస్పీ: గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడం కోసం గట్టి నిఘా ఏర్పాట్లు చేశాం. 24/7 పర్యవేక్షణ ఉంటుంది. గ్రామాల్లో శాంతిభద్రతల విఘాతానికి పాల్పడేవారు ఎంతటి వారైనా చర్యలు తప్పవు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

ప్రశ్న: సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టిన వారిని ఎలా గుర్తిస్తారు ?

డీఎస్పీ: సోషల్ మీడియాలో ప్రజలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు, వీడియోలు, ఫొటోలు పెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఆయా గ్రూపులలో అడ్మిన్‌లు కూడా అప్రమత్తతతో ఉండాలి. ఈ విషయంలో అడ్మిన్లను కూడా బాధ్యులుగా గుర్తిస్తాం. అదేవిధంగా సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వచ్చిన పోస్టులను షేర్‌చేయడం కూడా నేరంగా పరిగణిస్తాం.

ప్రశ్న: ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీఎస్పీ: గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ నిబంధనల మేరకు నడుచుకోవాల్సి ఉంటుందని అవగాహన కల్పిస్తున్నాం.

డిప్యూటీ స్పీకర్ రాంచంద్రారెడ్డికి నివాళి



రామచంద్రారెడ్డి జయంతి సందర్భంగా దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివంగత డిప్యూటీ స్పీకర్ పి.రాంచంద్రారెడ్డి 96వ జయంతి కార్యక్రమాలను బుధవారం సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నటరాజ్ థియేటర్‌లో రాంచంద్రారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం థియేటర్ సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

మెదక్ అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ మహేష్ సూచించారు. ప్రతి నెల బుధవారం నిర్వహించే సైబర్ జాగురూక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అవగాహన ర్యాలీని హెడ్ పోస్టాఫీసు నుంచి రాందాస్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసం జరిగిన 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

పాఠశాలల పని తీరుపై ప్రత్యేక నిఘా

మనూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పనితీరుపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని ప్రత్యేకంగా నియమించిన నోడల్ అధికారి ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం మనూరు ప్రాథమిక పాఠశాలను నోడల్ అధికారి బృందం విజిట్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పని తీరును పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి

● పలు మండలాల్లో వర్ధంతి కార్యక్రమాలు



ఖేడ్‌లో నివాళులర్పిస్తున్న జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



నర్సాపూర్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం సభ్యులు

నారాయణఖేడ్/నర్సాపూర్/పెద్దశంకరంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు శికాంతాచారి వర్ధంతిని బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శ్రీకాంతాచారి అమరుడయ్యాడని గుర్తు చేసుకున్నారు. నారాయణఖేడ్‌లో అఖిల భారత విరాట్ విశ్వకర్మ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, తదితరులు శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెదక్ జిల్లాలోని నర్సాపూర్ పట్టణంలో విశ్వబ్రాహ్మణ- విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృపాచారి, విశ్వబ్రాహ్మణ- విశ్వకర్మ పట్టణ అధ్యక్షులు నరేందర్‌చారి, ప్రవీణ్, అంజయ్య, శ్రీరాములు, సదానందం, అనిల్ పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలో పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శ్రీకాంతాచారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పేట స్వర్ణకార సంఘం బాధ్యులు బాయ్‌కాయికాడి నరసింహులు చారి, సంతోష్‌కుమార్, లక్ష్మీకాంతం, యువకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దత్తజయంతి ఉత్సవాలు



దంపతులతో యజ్ఞ క్రతువును నిర్వహింపజేస్తున్న వేదపండితులు

ఝరాసంగం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో దత్త జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం గణపతి, పుణ్యాహావాచనం, రుత్విక్ వరణం, మహా మంగళహారతి కార్యక్రమాలు కొనసాగాయి. 21 యజ్ఞ కుండాల వద్ద దంపతులతో వేదపండితులు యజ్ఞ క్రతువును నిర్వహించారు. కార్యక్రమానికి కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి అవదూతగిరి మహారాజ్, భక్తులు పాల్గొన్నారు. కాగా మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం దత్త జయంతి ఉత్సవాలు ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించానున్నారు. సాయంత్రం 21,600 దీపాలతో దీపారాధన నిర్వహిస్తారు.

హోరాహోరీగా కుస్తీపోటీలు

టేక్మాల్ డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాద్లూర్ గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. బుధవారం నిర్వహించిన పోటీల్లో మెదక్ జిల్లాకు చెందిన మల్లయోధులతో పాటు సమీపంలోని కర్ణాటక, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు చెందిన మల్లయోధులు తరలివచ్చారు. పోటీల్లో కర్ణాటకకు చెందిన సిద్దు బ్రహ్మిని అనే మల్లయోధుడు విజేతగా నిలిచాడు. అతడికి నగదుతో పాటు వెండి కడియాన్ని ఆలయకమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దుర్గయ్య, యాదయ్య, రాజేందర్, కొండయ్య తదితరులు ఉన్నారు.

తానా సాహిత్య భేరిలో ఓడీఎఫ్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ప్రతిభ

● గేయ కవితలో అంతర్జాతీయ ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రంలో మల్లగల్ల హయతి

కంది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) బాలసాహిత్య భేరి పేరిట ఆదివారం అంతర్జాతీయ అంతర్జాల దృశ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయుధ కర్మాగారం జడ్పీహెచ్ఎస్‌లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని మల్లగల్ల హయతి అందులో పాల్గొని ప్రశంసాపత్రం పొందినట్లు తెలుగు భాషోపాధ్యాయుడు అడ్డాడ శ్రీనివాసరావు తెలిపారు. అంతర్జాతీయస్థాయిలో అమెరికా, మలేషియా, భారత్ దేశాల నుంచి ఎంపిక చేసిన మొత్తం 101 మంది బాల బాలికలు కథ, కవిత, పద్యం, గేయం విభాగాల్లో పాల్గొని తమ రచనలను వినిపించారు. కాగా హయతి గేయ కవితను వినిపించి ఆకట్టుకుంది. ఈ మేరకు బుధవారం తానా ప్రతినిధులు ప్రశంసాపత్రాన్ని బహూకరించారు.

కేంద్రంపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి: సీఐటీయూ



సంగారెడ్డిలోమాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధమవ్వాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఐబీ నుంచి జడ్పీ కార్యాలయంలో వరకు 2 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ పట్టణంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో సీఐటీయూ రాష్ట్ర ఐదవ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నెల 7న నిర్వహించే బహిరంగసభకు కార్మికవర్గం విజయవంతం చేయాలని కోరారు.నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిన మోదీ ప్రభుత్వంపై కార్మిక వర్గం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఏకశిలా శివలింగానికి పూజలు



కాళ్లకల్ వద్ద ఏకశిలా శివలింగాన్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

మనోహరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలోని చంపారన్‌లో ఏర్పాటు చేయనున్న ప్రపంచంలోనే అతిపెద్ద శివలింగాన్ని తమిళనాడులోని మహబలిపురం నుంచి తరలిస్తున్నారు. 210 టన్నుల బరువున్న శివలింగం తరలింపు కార్యక్రమం ఏకాదశినాడు రాత్రి మహాబలిపురం నుంచి ప్రారంభమైంది. ఈ క్రమంలో బుధవారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ 44వ జాతీయ రహదారి గుండా శివలింగాన్ని తరలిస్తుండగా ప్రజలు భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు. కాళ్లకల్ బంగారమ్మ ఆలయం వద్ద శివలింగానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు చేశారు. కాళ్లకల్ వద్ద గ్రామస్థులు శివలింగాన్ని దర్శించుకుని పూజలు చేశారు.

అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి

కౌడిపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల మూడో విడత సందర్భంగా మండలంలో నామినేషన్ల పక్రియ ప్రారంభం కావడంతో బుధవారం అభ్యర్థులు పెద్ద ఎత్తున మండల కార్యలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అర్ఓ అధికారులకు ఆర్డీవో సూచించారు. కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **కంగ్టి:** మండలంలో బుధవారం నుంచి ప్రారంభమైన మూడోవిడత నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి నూతన్‌కుమార్, ఎంపీడీవో సత్తయ్య, ఎమ్మార్వో భాస్కర్, ఎంఈవో రహీమోద్దిన్‌లు క్లస్టర్ల వారీగా కేంద్రాలను పరిశీలించారు. ఆయా క్లస్టర్లలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకున్న చర్యలు, విద్యుత్, తాగునీరు వంటి వసతులు పరిశీలించారు.

ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి

రేగోడు డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రచారానికి వాడే వాహనాలకు తప్పనిసరి అనుమతి తీసుకోవాలని తహసీల్దార్ దత్తారెడ్డి బుధవారం తెలిపారు. ఆటో, జీపు, కారు, బస్సు వాహనాలకు గుర్తులతో ప్రచారం చేస్తే సీజ్ చేస్తామని, అనుమతి తీసుకొని ప్రచారానికి వాడుకోవచ్చని తెలిపారు. నిబంధనలు పాటిస్తూ అభ్యర్థులు ప్రచారం చేసుకోవాలన్నారు.

చిన్నశంకరంపేటలో వాహనాల తనిఖీలు



వాహనాలను తనిఖీలు చేస్తున్న ఎఫ్ఎస్‌టీ బృందం

చిన్నశంకరంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎస్‌టీ బృందం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని బుధవారం మెదక్-చేగుంట రహదారిపై ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ ప్రభుదాస్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలలో అక్రమ మద్యం, డబ్బులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబ్బందనలు పాటించాలని, నిబ్బందనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

పెద్దశంకరంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని పెద్దశంకరంపేట ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనుచిత పోస్టులు ఫార్వర్డ్ చేసిన వారిపైన కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు.

శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలి

మనోహరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్ఐ సుభాష్‌గౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

నేటి నుంచి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు



క్రీడా మైదానాన్ని పరిశీలించిన కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్

పటాన్‌చెరు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్ పాఠశాలల మధ్య పోటీ తత్వాన్ని నెలకొల్పడానికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు క్రీడోత్సవాలు నిర్వహించనున్నారని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం పటాన్‌చెరు మైత్రీ మైదానంలో క్రీడల ఏర్పాట్లపై పర్యవేక్షణ జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు ఆటలపోటీలు ఉంటాయన్నారు. అనంతరం జేపీ కాలనీలో జరుగుతున్న వరదకాలువ నిర్మాణపనులు పరిశీలించారు. నాణ్యతాప్రమాణాలు పాటించాలని గుత్తేదారుడికి చెప్పారు.కార్యక్రమంలో సాయితేజ, నర్సింహ, ప్రభాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మిపతి, విజయశ్రీ తదితరులు ఉన్నారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు

నారాయణఖేడ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డుకు సంబంధించి బైపాస్ రోడ్డులోని అమృత హాస్పిటల్ సమీప కాలనీలో తాగునీటి పైప్‌లైన్, సీసీ రోడ్డు, మురుగు కాల్వలు లేక పోవడంతో కాలనీ వాసులు ఎంతోకాలంగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేయడానికి బుధవారం పైప్‌లైన్, సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనులను మున్సిపల్ కమీషనర్ జగ్జీవన్, మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ పరిశీలించారు. నాణ్యతగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

హల్దీ వాగులో వ్యక్తి గల్లంతు

వెల్దుర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎండ్రకాయల వేటకు హల్దీ వాగుకు వెళ్లి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హస్తాల్‌పూర్ గ్రామంలోని గంగిరెద్దులవాడకు చెందిన జానపాటి సాయిలు. అవుల దుర్గయ్య గ్రామ శివారులోని హల్దీ వాగులో ఎండ్రకాయలు వేటకు వెళ్లాడు. ఎండ్ర కాయలు పట్టుకొని బయటకు వస్తుండగా దుర్గయ్య ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. దీంతో భయాందోళనకు గురైన సాయిలు గ్రామ పెద్దల సమాచారం అందించి వాగులో గాలించినా ఫలితం లేకపోయింది. గజ ఈతగాళ్ల సాయంతో వెతికినా ఆచూకీ లభించలేదు.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ దహనం

కంది, డిసెంబరు 3. (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి కందిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండల కేంద్రంలోని 2వ వార్డులో నివాసం ఉంటున్న జొన్నాడ పాండు తన బైకును మంగళవారం రాత్రి ఇంటి ముందు పార్కు చేశాడు. అయితే రాత్రి 11 గంటలు దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ఆ బైకును తగలబెట్టారు. బుధవారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డుల పాత్ర కీలకం

మెదక్ అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డు సిబ్బంది పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. హోంగార్డు రైసింగ్ డే పురస్కరించుకొని బుధవారం జిల్లా పోలీసు మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందించడంలో క్రీడలు విశేషంగా దోహదం చేస్తాయన్నారు. వాలీబాల్, కబడ్డీ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు

వ్యవసాయ కళాశాల బృందం పర్యటన

● డ్రోన్ ఆధారిత వ్యవసాయంపై అవగాహన

కంది, డిసెంబరు 3. (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత విద్యా పర్యటనలో భాగంగా సంగారెడ్డి జిల్లా కందిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల మూడో సంవత్సరం విద్యార్థులు తమ తొలి రోజు శాస్త్ర సాంకేతిక పర్యటనలో బెంగళూరులో గాంధీ కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి డీన్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డాక్టర్ కే. ఎస్. రాజశేఖరప్ప, వ్యవసాయ యాంత్రిక విభాగాధిపతి ప్రొఫెసర్ జయశ్రీ వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగంలోని వివిధ పరిశోధన ప్రయోగశాలలు, ఆధునిక వ్యవసాయ యాంత్రిక పరికరాలు, వ్యవసాయ సాంకేతికతలు, ప్రాజెక్టు అవకాశాలపై అవగాహన పొందారు.

దేవుళ్లను హేళన చేయడం సరికాదు: బీజేపీ

మెదక్ అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి హిందూ దేవుళ్లపై నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని అని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ విమర్శించారు. హిందూ దేవుళ్లను హేళన చేసి మాట్లాతున్న రేవంత్‌రెడ్డి హిందువా.. కాదా? అని అయన ప్రశ్నించారు. సీఎం అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్ పటేల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత షురూ

(5వ పేజీ తరువాయి)

అందజేసి దాఖలు చేసేందుకు రాత్రి వరకు అవకాశం కల్పించారు. వెంకటాపూర్ క్లస్టర్‌లో ఒక్క నామినేషన్ కూడా పడలేదు. నామినేషన్ల ప్రక్రియను సబ్ కలెక్టర్ ఉమాహారతి క్లస్టర్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. మెదక్ జిల్లాలోని ఏడు మండలాల్లో మూడో విడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 183 గ్రామ పంచాయతీల్లో 1,528 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. బుధవారం ఆయా పంచాయతీల్లోని సర్పంచ్ స్థానాలకు 140, వార్డు స్థానాలకు 344 నామినేషన్లు వచ్చాయి.

సంగారెడ్డి జిల్లాలో మూడో విడత నామినేషన్ల వివరాలు

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
నారాయణఖేడ్	47	38	394	39
కంగ్టి	33	20	280	1
మనూరు	22	17	184	2
నాగల్‌గిద్ద	33	24	258	9
కల్హేర్	15	16	134	21
సిర్గాపూర్	28	11	226	11
నిజాంపేట	18	14	152	17
న్యాల్‌కల్	38	15	332	17

మెదక్ జిల్లాలో ...

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
నర్సాపూర్	35	14	282	44
శివ్వంపేట	37	30	312	99
కొల్చారం	21	8	192	19
మాసాయిపేట	13	15	106	62
చిలప్‌చెడ్	19	14	156	38
వెల్దుర్తి	23	25	200	35
కౌడిపల్లి	35	34	280	47

మూడు మున్సిపాలిటీలు.. ఇక నుంచి జీహెచ్ఎంసీ

(5వ పేజీ తరువాయి)

కార్యాలయంపై జీహెచ్ఎంసీ హైదరాబాద్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్లు ఇకపై డిప్యూటీ కమిషనర్లుగా, ఇతర సిబ్బంది యథాతథ హోదాల్లో తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఇక్కడే పనిచేస్తారని జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నారు. అదే సమయంలో పురపాలికల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారుల బృందాలు ఇప్పటికే విచారణలోకి దిగాయి. పట్టణ ప్రణాళిక విభాగంలోని ఒప్పంద ఉద్యోగులకు తాఖీదులు జారీ చేసి స్వచ్ఛందంగా రాసివ్వాలని కోరుతున్నట్టు సమాచారం. ప్రధానంగా ఇష్టారీతిన వాణిజ్య సముదాయాలకు అనుమతులు జారీపై విచారణ చేపట్టినట్టు తెలిసింది.

ఒకరిని అడిగితే.. ఇంకొకరిని పంపారు!

(5వ పేజీ తరువాయి)

రేడియోగ్రాఫర్(ఎక్స్‌రే టెక్నీషియన్)సేవలు వినియోగించుకోవాలని సంబంధిత క్షయ నివారణ విభాగం ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. దీంతో ఓ రేడియోగ్రాఫర్‌తో పాటు ఓ ల్యాబ్ టెక్నీషియన్‌ను డిప్యూటేషన్‌పై ప్రతిపాదించాలని జిల్లా క్షయ నివారణ విభాగం అధికారి(డీటీసీవో) నుంచి గత నెల 28న టీవీవీపీ జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త(డీసీహెచ్ఎస్)కు లేఖ పంపారు. వాస్తవానికి డీటీసీవో సిఫారసు మేరకు సదరు డీసీహెచ్ఎస్ రేడియోగ్రాఫర్(ఎక్స్‌రే టెక్నీషియన్)హోదా కలిగిన వ్యక్తి పేరును ప్రతిపాదించాల్సి ఉన్నా.. నిబంధనలకు విరుద్ధంగా ఈసీజీ టెక్నీషీయన్ హోదా కలిగిన మరో వ్యక్తి పేరును ప్రతిపాదించారు. విచిత్రమేమిటంటే జోగిపేట ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ ఈసీజీ టెక్నీషియన్‌ను డిప్యూటేషన్‌పై ఏకంగా తన హోదాను మార్చి మరీ ఈ నెల 1న ఎక్స్‌రే టెక్నీషియన్‌గా ప్రతిపాదించడం తోటి వైద్య సిబ్బంది, ఉద్యోగ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతున్నది. జిల్లా వ్యాప్తంగా టీవీవీపీ ఆస్పత్రుల్లో ఎంతో మంది రేడియోగ్రాఫర్లు పనిచేస్తున్నప్పటికీ వారిని కాదని, ఈసీజీ టెక్నీషియన్ పేరును ప్రతిపాదించడం గమనార్హం. కాగా జోగిపేట ఏరియా ఆస్పత్రి నుంచి ఈసీజీ టెక్నీషియన్‌ను డిప్యూటేషన్‌పై నియమించడంతో మంత్రి ఇలాకాలో ఉన్న వంద పడకల ఏరియా ఆస్పత్రిలో ఉన్న ఒక్క ఈసీజీ టెక్నీషియన్ లేకుండా పోయారని తెలుస్తోంది. ఇదే విషయమై సంగారెడ్డి డీసీహెచ్ఎస్ డా.షేక్ మహ్మద్ షరీఫ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

దివ్యాంగులతో ప్రతి ఒక్కరూ ప్రేమగా వ్యవహరించాలి



తూప్రాన్‌లో చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో సత్యనారాయణ



వెల్దుర్తి ఎమ్మార్సీ కార్యాలయంలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో సీతారాం



నిజాంపేట: నస్కల్ పాఠశాలలో దివ్యాంగుల హక్కులపై వివరిస్తున్న ఎంఈవో యాదగిరి

కల్హేర్/సిర్గాపూర్/నారాయణఖేడ్/, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న దివ్యాంగ సిబ్బందిని సన్మానించారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. పలువురు మాట్లాడుతూ.. దివ్యాంగుల మనోధైర్యం ఎంతో గొప్పదని, వారి పట్ల ప్రతిఒక్కరూ ప్రేమగా వ్యవహరించాలన్నారు. కల్హేర్, సిర్గాపూర్ మండల కేంద్రాల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమాలను ఎంఈవోలు సురేష్, నాగారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నారాయణఖేడ్ పాలిటెక్నిక్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ విధానంతో విధులు నిర్వహిస్తున్న దివ్యాంగుడు ప్రేమ్‌సింగ్‌ను, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

మెదక్ జిల్లాలో..

తూప్రాన్/వెల్దుర్తి/నిజాంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ విద్యా వనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. తూప్రాన్ భవిత కేంద్రంలో ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా, ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణ బహుమతులు అందజేశారు. వెల్దుర్తి మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో సీతారామ్ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులను అందజేశారు. నిజాంపేట మండలం నస్కల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎంఈవో ఎస్ యాదగిరి పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల హక్కులు, గౌరవం, సంక్షేమాన్ని ప్రోత్సహించాలన్నారు.



కల్హేర్‌లో దివ్యాంగులకు బహుమతులందజేస్తున్న ఎంఈవో సురేష్, ఉపాధ్యాయులు



ఖేడ్ పాలిటెక్నిక్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ అటెండర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది